క్లుప్తంగా

జీవ పరిణామ సిద్ధాంతంపై అవగాహన

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ భద్రయ్య మాట్లాడుతూ.. విద్యార్థులలో శాస్త్రీయ విజ్ఞాన వైఖరులను పెంపొందించడానికి, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు బొల్లు అయిలయ్య, షేక్ మీరాహుస్సేన్, మేరెడ్డి ఇంద్రసేనారెడ్డి, యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ప్రతినిధి నాగుల జ్యోతి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీసీసీఎఫ్‌ను కలిసిన రోశిరెడ్డి



డాబ్రియేల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రోశిరెడ్డి

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ ఫారెస్ట్ ఆర్ఎమ్ డాబ్రియేల్‌ను భద్రాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు యడమకంటి రోశిరెడ్డి సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అటవీ సంరక్షణ, వన్యప్రాణ సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై మాట్లాడారు. భద్రాద్రి జిల్లాలో అడవుల సంరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రోశిరెడ్డి కోరారు. అడవులలో వన్యప్రాణుల సంరక్షణకు కఠిన చట్టాలను తీసుకురావాలని కోరారు.

చర్యలు తీసుకోవాలి

గుండాల: ఆళ్లపల్లి మండల కేంద్రంలోని పెట్రోల్ బ్యాంకు కల్తీ విక్రయాలు నిర్వహిస్తున్న బంక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని న్యూడెమోక్రసీ నాయకులు పూణెం రంగన్న, కొక్కు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం ఆళ్లపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ఆర్ఐ బుల్లిబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ బంకులో డీజిల్ పోయించుకున్న కొద్దిసేపటికే ఇంజన్లు చెడిపోతునఆనయని, యాజమాన్యం పట్టించుకోకుండా యథేచ్ఛగా కల్తీ విక్రయాలు కొనసాగిస్తోందని విమర్శించారు. అధికారులు చర్యలు తీసుకోవానలి డిమాండ్ చేశారు. నాయకులు బట్టు ప్రసాద్, బత్తిని సత్యం, అటికం శేఖర్, తోట వీరభద్రం, సుభద్ర, కుంజ ఎర్రయ్య, యనగంటి లాజర్, బొమ్మెర వీరన్న, బాధిత రైతు గొగ్గెల రామయ్య పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడాలి

అశ్వారావుపేటరూరల్: ప్రజాసమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దాకా పోరాటాలు చేయాలని సీపీఐ నియోజకవర్గ నాయకులు సయ్యద్ సలీం పిలుపునిచ్చారు. పట్టణంలోని నల్లమల్ల గిరిప్రసాద్ నగర్‌లో సోమవారం పట్టణ మహాసభను నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆ తర్వాత జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ నిర్మాణం ఒక వ్యక్తితో సాధ్యం కాదని, ప్రతి ఒక్కరూ సమిష్టి కృషితోనే సాధ్యమన్నారు. అనంతరం 58 మంది కౌన్సిల్ సభ్యులతో కలిపి టౌన్ కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీలో టౌన్ కార్యదర్శిగా నూకవరపు విజయకాంత్, సహాయ కార్యదర్శులుగా ఎస్‌డీ జాకీర్, జక్కం బలరాం, జోగి రాజుల, కోశాధికారిగా చీపుర్ల సత్యవతితోపాటు మరికొంతమందిని కౌన్సిల్ సభ్యులుగా ఎనుకున్నారు. నరాటి ప్రసాద్, గన్నిన రామకృష్ణ, పఠాన్ జలాల్ ఖాన్ పాల్గొన్నారు.

సేకరణ ప్రారంభించాలి

దమ్మపేట: అటవీ ప్రాంతాల్లో తునికాకు సేకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకుడు అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దమ్మపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద కాసేపు నిరసన కార్యక్రమం నిర్వహించిన అనంతరం.. ఇన్‌చార్జ్ తహసీల్దార్ వాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమర్లపూడి రాము మాట్లాడారు. నాయకులు కుర్సం ముత్యాలరావు, పందూరి వీరబాబు, ముక్తేశ్వరి, అనిల్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు చేపట్టండి

మణుగూరురూరల్: వర్షపు కాలంలో వరద ముంపు నుండి తమ ప్రాంతాన్ని కాపాడేందుకు చర్యలు చేపట్టాలని అశోక్‌నగర్ (మణుగూరు కోర్ట్) ప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. సోమవారం వారు విలేకరుల ముందు తమ గోడును వెలబోసుకున్నారు. ఇటీవల కోర్ట్‌కు ప్రహరీ నిర్మించడంతో వర్షాకాలంలో వరద నీరంతా నిలిచిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

- ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు
- ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చర్యలు


చంద్రుగొండ: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్


పినపాక: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు


భద్రాచలంటౌన్: పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై ఆరా తీస్తూ..

పినపాక: ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల పరిధిలోని పినపాక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ సునీల్, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై రాజ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలని, వేసవికాలం కావడంతో ఓటర్లకు మంచినీళ్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. భద్రత ఏర్పాట్లు చూసుకోవాలని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిల పోలింగ్ కేంద్రాన్ని మండల అధికారులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఎన్నిల సందర్భంగా పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసిన్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, టౌన్ సీఐ బరపాటి రమేష్, ఎంపీడీఓ బొగ్గ నారాయణ పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని డీఎస్పీ అబ్దుల్ రహెమాన్ సోమవారం రాత్రి పరిశీలించారు. ఈ నెల 27న, ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనున్న విషయం విదితమే. ఈ క్రమంలో పోలింగ్ కేంద్రాన్ని డీఎస్పీ పరిశీలించి సదుపాయల ఏర్పాటు సమీక్షించారు. డీఎస్పీ వెంట ఎస్ఐ శివరామకృష్ణ పాల్గొన్నారు. ఉదయం తహసీల్దార్ సంధ్యారాణి సదుపాయాలు పరిశీలించారు. ఆమె వెంట గిర్దావర్ అక్బర్ ఉన్నారు.

ఫ్రీ చికెన్ మేళాకు స్పందన

అశ్వారావుపేటరూరల్: బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్‌పై వస్తున్న అపోహలు, అనుమానాలను నివృత్తి చేసేందుకు వెన్‌కాబ్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అశ్వారావుపేటలో ఫ్రీ చికెన్, ఎగ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సంత మార్కెట్ వద్ద ఆ సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో 2 క్వింటాళ్ల చికెన్ పకోడి, చికెన్ 65 తయారీ చేసి ఉచితంగా పంపిణీ చేశారు. ఒక క్వింటా చికెన్‌తో చేసిన వంటకాలు గంట వ్యవధిలోనే ఖాళీ కావడంతో ఫ్రీ చికెన్ మేళాకు స్పందన లభించినట్లు కంపెనీ ప్రతినిధులు, స్థానిక చికెన్ షాపుల సంఘం బాధ్యులు హేమంత్ కుమార్ తెలిపారు. అదే విధంగా రెండు వేల కోడి గుడ్లను కూడా వినియోగదారులకు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో చికెన్ దుకాణాదారులు ఎస్‌కె.షౌకత్, ఎండి.తహసీన్, షేక్ కరీం పాల్గొన్నారు.


అశ్వారావుపేటలో నిర్వహించిన చికెన్ మేళా కార్యక్రమం

మార్చి 9న పద్మశాలి మహాసభ

మణుగూరురూరల్: హైదరాబాద్‌లో మార్చి 9వ తేదీన జరిగే 17వ అఖిలభారత పద్మశాలి మహాసభను జయప్రదం చేయాలని తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పద్మశాలి సంఘ కార్యాలయంలో మండల అధ్యక్షుడు డాక్టర్ దుస్సా సమ్మయ్య అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రామచంద్రరావు మాట్లాడుతూ.. పద్మశాలి కుల బాంధవులందరిని ఏకం చేసేందుకు మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పద్మశాలిలంతా ఐక్యంగా ఉంటూ హక్కులను కాపాడుకునేందుకు చట్టసభల్లో ఉండాలని, రాజకీయంగా ఎదగాలన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగా ముందుకు నడవాలన్నారు. మార్చి 9న జరిగే మహాసభకు పద్మశాలి కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. అనంతరం మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల ప్రధాన కార్యదర్శి కోటా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మహేశ్వరపు రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్ర నాగరాజు, చీఫ్ అడ్వైజర్ గుండ్ల వెంకటేశ్వరరావు, సందా సత్యనారాయణ, చిలకా వెంకట్రామయ్య, కొరివి బసవయ్య, వెంకన్న, ఎస్ కోటేశ్వరరావు, కనకయ్య, రత్నాకర్, రామకృష్ణారావు, ఏడుకొండలు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ప్రశంసాపత్రం


ఉపాధ్యాయుడు చంద్రును సన్మానిస్తున్న ఏటీడీఓ చంద్రమోహన్

చంద్రుగొండ: మండలంలోని అన్నారంతండాలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చంద్రుకు ఐటీడీపీ బి.రాహుల్ ప్రశంసాపత్రం పంపించారు. పీఓ ఆదేశాల మేరకు దమ్మపేట సహాయ గిరిజన సంక్షేమ అధికారి చంద్రమోహన్ సోమవారం పాఠశాలకు చేరుకుని విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో ఉపాధ్యాయుడు చంద్రును సత్కరించి ప్రశంసాపత్రం అందించారు. పీఓ రాహుల్ ఇటీవల పాఠశాలను సందర్శించిన నేపథ్యంలో ఉద్దీపనం వర్క్‌బుక్‌లోని కృత్యాలను విద్యార్థులు అర్థం చేసుకుని ఆంగ్లం, గణితశాస్త్రంలో చదవడం, రాయడంలో చూపిన శ్రద్ధకు పీఓ ఆశ్చర్యపోయారు. ఈ నేపథ్యంలోనే ఉపాధ్యాయుడు చంద్రుకు ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం భద్రు, పాఠశాల హెచ్‌ఎం.కబీర్‌దాస్ పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

ములకలపల్లి: గిరిజన యువకుడు కొమరం సమ్మయ్యపై దాడికి పాల్పడిన అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) జిల్లా కార్యదర్శి కల్లూరి కిషోర్ డిమాండ్ చేశారు. సోమవారం ములకలపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని యాకన్నగూడెం గ్రామానికి చెందిన సమ్మయ్యపై చర్ల రేంజ్ పరిధిలోని అటవీ సిబ్బంది అకారణంగా భౌతికదాడికి తెగబడడం దారుణమన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని అన్నారు. దాడి కారకులను కఠినంగా శిక్షించాలని, ఆ మేరకు చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు.

ఏఓకు మద్దతు

అశ్వాపురం: ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ ఏఓ సాయిశంతన్‌కుమార్‌కు అశ్వాపురం మండల ఫెర్టిలైజర్ అండ్ ఫెస్టిసైడ్స్ షాపుల యజమానుల సంఘం మద్దతు తెలిపారు. సోమవారం మొండికుంట సంఘం నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఏఓ నిజాయితీపరుడని, రైతులకు అందుబాటులో ఉండేవాడని గుర్తు చేసుకున్నారు. కొంతమంది తమ స్వలాభానికి వ్యవసాయ అధికారిని కావాలని ఏసీబీకి పట్టించారని, అలా పట్టించింది ఎరువుల షాపుల యజమానులే అనే వదంతులను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మండల ఫెర్టిలైజర్ అండ్ ఫెస్టిసైడ్స్ షాపుల యజమానులు నూకారపు భిక్షమయ్య, సోమ వెంకటరెడ్డి, సోమ శ్రీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కోటిరెడ్డి, చలమల శివారెడ్డి, వేణురెడ్డి, జగదీష్, సంజీవ్‌నాయక్, మోహన్‌రెడ్డి, రవి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అడ్డగోలుగా వాహనాలు నిలిపితే ఉపేక్షించం


రహదారి వెంట వాహనాలను తీయాలని సూచిస్తున్న సీఐ సతీష్

మణుగూరుటౌన్: ప్రధాన రహదారిపై వాహనాలు వెళ్లడానికి లేకుండా వాహనాలు నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, అలా చేస్తే ఊరుకునేది లేదని సీఐ సతీష్ అన్నారు. సోమవారం పట్టణంలో ఎస్‌బీఐ ఏరియాలో రోడ్లపై, యూ టర్న్‌కి అడ్డంగా నిలిపి ఉంచిన మోటార్‌సైకిల్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అదేవిధంగా వ్యాపారులు రోడ్లపై పార్కింగ్ ప్రదేశంలో దుకాణాలు పెట్టడం వల్ల మోటార్‌సైకిళ్లు రోడ్లపైకి వస్తున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్లపై దుకాణాలను వెనక్కి జరిపించారు. వాహనదారులు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయొద్దని ఆయన సూచించారు.

విజయం సాధించాలి

దమ్మపేట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు వంద శాతం ఫలితాలతో ఘన విజయం సాధించాలని, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో అశ్వారావుపేట మండలానికి చెందిన ముఖ్య కాంగ్రెస్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ.. ప్రజలు, కార్యకర్తలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్సంబంధాలను కొనసాగించాలని సూచించారు. అంతకుముందుగా పార్కలగండి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి, మెనూను సక్రమంగా అమలు చేయాలని వార్డెన్‌కు సూచించారు. మల్కారం, అంకంపాలెం గ్రామాల్లో పలు కుటుంబాలను పరామర్శించారు.

నేతాజీ వాకర్స్ టీం చేయూత

మణుగూరుటౌన్: జాతీయ స్థాయి అథ్లెటిక్ క్రీడాకారుడు ఆపక సతీష్‌కు మణుగూరు నేతాజీ వాకర్స్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. దుమ్ముగూడెం మండలం మారాయిగూడెం గ్రామానికి చెందిన సతీష్ రాష్ట్ర జాతీయ స్థాయిలో అథ్లెటిక్స్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచి, ప్రస్తుతం బెంగళూరులో జరిగే ఆసియా జాతీయ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా.. నేతాజీ వాకర్స్ టీం దృష్టికి రావడంతో రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, రావులపల్లి రామూర్తి, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, సామ శ్రీనివాసరెడ్డి, కటకం సతీష్, వడ్లాణం రమేష్, మైత్రి శంకర్‌రెడ్డి, జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, వాగబోయిన నాగేశ్వరరావు, కొరిమిల్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సీరియల్ నంబర్లు వేయించాలి

దమ్మపేట: మండల పరిధిలోని ప్యాసింజర్ ఆటోలు అన్నింటికీ తప్పనిసరిగా సీరియల్ నంబర్ వేయించాలని స్థానిక ఎస్సై సాయి కిషోర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆటోలకు సీరియల్ నంబర్ స్టిక్కర్లను, షీ టీం వివరాలను తెలియజేసే పోస్టర్లను అంటించారు. ఆటో యజమానులకు సంబంధించిన వివరాలను పోలీస్ స్టేషన్లో నమోదు చేయించారు. ఇంకా వివరాలు నమోదు చేయించని వారు ఎవరైనా ఉంటే తప్పనిసరిగా స్టేషన్‌కు వచ్చి నమోదు చేయించుకోవాలని సూచించారు.

రామాలయానికి వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకుని మార్చి 9న విగ్రహ ప్రతిష్ఠ కానున్న సీతారామచంద్రస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి–లక్ష్మిలు సోమవారం విగ్రహాలు గ్రామానికి వచ్చిన సందర్భంగా ఆలయానికి గంట, శటగోపం, హారతి పళ్లెం వితరణగా అందజేశారు. మల్లారెడ్డి కుటుంబసభ్యులు గతంలో ఆలయానికి రూ.50,116 విరాళంగా అందజేశారు.

మెనూ అమలు చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని బీసీ గురుకుల విద్యార్థులకు నాణ్యత లేని వంటకాలను వడ్డిస్తున్నారని, ప్రభుత్వం కల్పిస్తున్న ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన మెనూ అమలు చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి మునిగల శివప్రశాంత్ అన్నారు. బీసీ గురుకుల వసతి గృహాన్ని ఆయన సోమవారం సందర్శించి విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రిన్సిపాల్‌కు వర్కర్లకు మధ్య జరిగిన గొడవలో విద్యార్థులకు నాణ్యత లేని అహారాన్ని పెడుతున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించాలన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మణుగూరు భారజల కర్మాగారం జీఎం హెచ్‌కే.శర్మ


శిబిరంలో రక్తదానం చేస్తున్న జీఎం శర్మ

అశ్వాపురం: రక్తదానం ప్రాణదానంతో సమానమని మణుగూరు భారజల కర్మాగారం జీఎం హెచ్‌కే.శర్మ అన్నారు. మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో హెచ్‌డబ్ల్యూపీఎం కాలనీ లేడీస్ ఆధ్వర్యంలో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రి, గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని భారజల కర్మాగారం జీఎం హెచ్‌కే.శర్మ, లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు ఓమాశర్మ ప్రారంభించారు. కాలనీ మహిళలు, ఉద్యోగులు రక్తదానం చేశారు. 115 మంది రక్తదాతల నుంచి 115 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ సందర్భంగా జీఎం శర్మ మాట్లాడారు. కార్యక్రమంలో డీజీఎం శ్రీనివాస్, లేడీస్ క్లబ్ ఉపాధ్యక్షురాలు స్వప్న, మంజూష, చందన,దేవిత, అనిత, గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు ప్రదీప్, సోమయ్య, శ్యాంసుందర్, వివై.చారి, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కె.కిరణ్, సంకీర్తన, చంద్రశేఖర్, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎండలతో జాగ్రత్తలు తప్పనిసరి

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): ప్రస్తుతం ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు డాక్టర్ జితన్మయ్ సూచించారు. ఆమె సోమవారం సాక్షితో మాట్లాడుతూ.. ప్రజలకు రక్షణ చర్యలు వివరించారు. తాగునీరు అధికంగా తీసుకోవాలని, కొబ్బరినీరు, పళ్ళరసాలు తీసుకోవచ్చన్నారు. అత్యవసరమైతే తప్ప ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయటకు వెళ్ళకూడదన్నారు. ఒకవేళ వెళ్లాల్సి వస్తే తలపై తెల్లటి రుమాలు, గొడుగు, టోపీ, హెల్మెట్ రక్షణగా వాడాలన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తికి కళ్లు తిరగడం, జ్వరం రావడం, విరోచనాలు కావడం లాంటి లక్షణాలు కన్పిస్తాయన్నారు. పీహెచ్‌సీ పరిధిలో ఎండలు, వడదెబ్బపై గ్రామాల వారిగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

పరీక్షలతో ప్రతిభకు పదును


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు

మణుగూరురూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ప్రతిభా పోటీ పరీక్షలు దోహదపడతాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వరక అజిత్, జిల్లా ఉపాధ్యక్షుడు ఈనపల్లి పవన్‌సాయిలు అన్నారు. నేడు పదో తరగతి విద్యార్థులకు జరిగే మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించడం ద్వారా వారిలో మానసిక ధైర్యం పెరగడంతో పాటు ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు.

వార్షిక పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు ఈ టెస్ట్ ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి అక్కినపల్లి నాగేంద్రబాబు, మండల నాయకులు రాజు, అలోక్, రాము, రఘు, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠ విగ్రహాలకు స్వాగతం


మొండికుంటలోని విగ్రహాల ఊరేగింపులో గ్రామస్తులు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామచంద్రస్వామి ఆలయంలో మార్చి 9న విగ్రహ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో తిరుపతి నుంచి సీతారామచంద్రస్వామి, ఆంజనేయ విగ్రహాలు సోమవారం మొండికుంట చేరుకున్నాయి. గ్రామం పొలిమేర వద్ద విగ్రహాలకు గ్రామపెద్దలు, స్థానికులు ఘనస్వాగతం పలికి.. పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ప్రతి ఇంటి ముందు గ్రామస్తులు విగ్రహాలకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ కమటం నరేష్, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'జప్తుల పేరిట ఒత్తిడి చేస్తున్నారు'

ములకలపల్లి: బ్యాంకు రుణాలు చెల్లించకుంటే జప్తులు చేస్తామంటూ బ్యాంకర్లు రుణగ్రహీతలపై ఒత్తిడికి పాల్పడుతున్నారని తెలంగాణా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ఆరోపించారు. మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక డీసీసీ బ్యాంక్ మేనేజర్ రైతులను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. ఒత్తిడిలకు పాల్పడితే సహించేదిలేదని, సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సంఘ మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్, వర్సా శ్రీరాములు, గోపగాని లక్ష్మీనర్సయ్య, గొగ్గెల ఆదినారాయణ, సోయం కృష్ణ, భూక్యా శ్రీదేవి. గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా బాలమేళా..

ములకలపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ములకలపల్లి కాంప్లెక్స్ స్థాయి (ఎఫ్ఎల్ఎన్) బాలమేళాను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ సత్యనారాయణ మాట్లాడారు. పలువురు దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు అలంకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న శివాలయాలు


విద్యుత్ దీపాలతో అలంకరించిన శివాలయం

దమ్మపేట: మండల పరిధిలోని పలు శివాలయాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ముస్తాబవుతున్నాయి. రాబోయే శివరాత్రి పర్వదినమును పురస్కరించుకుని ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేసి, ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాలతో ఘనంగా అలంకరిస్తున్నారు. దీంతో మండల పరిధిలోని శైవ క్షేత్రాలు అపురూపమైన శోభను సంతరించుకుంటున్నాయి. అర్చన, హోమం తదితర పూజా కార్యక్రమాలకు అవసరమైన సామగ్రిని కమిటీ వారు సమకూర్చుకున్నారు.

'ఆశ్రమ' విద్యార్థుల ప్రతిభ

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామంలోని రేగుబల్లి–2 బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయి కరాటే పోటీలలో రాణించారు. కరాటే మాస్టర్ వీరభద్రం శిక్షణలో తర్ఫీదు పొందిన విద్యార్థినులు జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో బహుమతులను అందుకున్నారు. బాలికలు అవంతి, అనూష, అశ్విని, వైష్ణవి, నివేజ, సింధు, భవాని గోల్డ్ మెడల్స్ అందుకోగా.. దీపిక, సునీత, మౌనిక, శాంతి, చరిత సిల్వర్ మెడల్స్‌ను అందుకున్నారు. బాలికల ఆత్మరక్షణకు కరాటే శిక్షణ ప్రత్యేకంగా ఇప్పించడంలో హెచ్‌యం భారతమ్మ, పీఈటీ జానకిలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి శిక్షణ ఇప్పించినట్లు తెలుస్తోంది.

బంగారు పతకాలు..

బూర్గంపాడు: కొత్తగూడెంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలో ఐటీసీ అనుబంధ భద్రాచలం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు.

సుమారు 300మంది విద్యార్థులు పాల్గొన్న ఈ చాంపియన్ షిప్ పోటీలలో భద్రాచలం పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న సిద్ధు, నిహాల్ గోల్డ్ మెడల్స్ సాధించారు. చక్రి, సతీష్‌లు సిల్వర్ మెడల్స్ సాధించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చేతుల మీదుగా వీరు మెడల్స్‌ను అందుకున్నారు. వీరిని కరాటే కోచ్ కిరణ్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.


దుమ్ముగూడెం: కరాటేలో రాణించిన బాలికలతో ఉపాధ్యాయులు


బూర్గంపాడు: కరాటే చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన బీపీఎస్ విద్యార్థులు